ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

ధరణితో దళారులకు పైసా ఇవ్వాల్సిన పని లేదు

వేలేరు, నవంబర్ 24: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం తీసుకొచ్చిన ధరణితో మంచి జరుగుతుంది. భూమి రిజిస్ట్రేషన్ కోసం దళారులకు పైసా ఇవ్వాల్సిన పనిలేదు. మధ్యవర్థులు లేకుండానే రిజిస్ట్రేషన్ అవుతుంది. రిజిస్ట్రేషన్ కావాల్సిన డబ్బులను ఆన్‌లైన్‌లోనే చెల్లించడంతో పని కూడా త్వరగా పూర్తవుతున్నది. మధ్యవర్థులకు డబ్బులిచ్చి మోసపోయే బాధలు తప్పినయ్. భూమి రిజిస్ట్రేషన్‌కు అయ్యే మొత్తం డబ్బులు కూడా ప్రభుత్వానికే చేరుతున్నయ్. ఎలాంటి సమస్యలు లేకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నయ్. రైతులకు గందరగోళం లేకుండా ఉండాలంటే ధరణి ఉండాల్సిందే.

– కొయ్యడ రవి, వేలేరు గ్రామం

వ్యవసాయాన్ని ఆగం చేసుకోం..

జఫర్‌గఢ్, నవంబర్ 24 : సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రెండు పంటలు పండుతున్నయ్. పదేండ్లలో వ్యవసాయంతో రైతులు క్రమేణా భాగుపడుతున్నరు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని ప్రకటనలు చేస్తున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలని అంటున్నరు. రైతులకు 3 గంటల కరెంట్‌తో ఒక్క మడి కూడా సాగుకాదు. 10 హెచ్‌పీల మోటర్లు రైతులకు అవసరం లేదు. వీటితో ఖర్చు పెరగడమేగాక, బావుల్లో నీళ్లు మొత్తం ఖాళీ అయితయ్. కాంగ్రెస్ మాయ మాటలకు రైతులు మోసపోరు. ఇప్పుడిప్పుడే బాగు పడ్తున్న వ్యవసాయాన్ని ఆగం చేసుకోం. తిరిగి బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

–తిప్పరబోయిన కృష్ణ, రైతు, జఫర్‌గడ్

పడావు భూమిని కాస్తు చేస్తున్నా..

లింగాలఘనపురం, నవంబర్ 24 : నాకు గుమ్మడవెల్లిలో సర్వే నంబర్ 71లో భూమి ఉంది. 10 గుంటల భూమి నంబర్ మిస్ మ్యాచ్ అయింది. భూమి నా స్వాధీనంలో ఉండగా, పట్టా వేరే వారిపేర నమోదైంది. సరి చేయాలని ఎన్ని సార్లు మొత్తుకున్నా అధికారులు ఇన్నేళ్లూ పట్టించుకోలె. నా పేర తప్పుగా నమోదైందని పక్క రైతు స్టేట్ మెంట్ ఇచ్చారు. ధరణితో అలాంటి కేసులకు చెక్ పెట్టినట్లైంది. మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోగా, ధరణితో సమస్య తీరింది. గిప్పుడు దర్జాగా సాగు చేసుకుంటున్న.. లేకుంటే.. కాస్తు చేశాక సదరు వ్యక్తి వచ్చి భూమి నా పేర ఉందని అంటే ఎట్లా అని భయపడే వాడిని. ఇప్పుడు స్వేచ్ఛగా ధైర్యంతో భూమిపై హక్కు రావడంతో సాగు చేసుకుంటున్న.

–వడిగం ఉప్పలయ్య, రైతు, మాణిక్యపురం

కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతు బతుకు ఆగమె..

గుగులోత్ రెడ్యా, రైతు, దుబ్బ తండా

దేవరుప్పుల, నవంబర్ 24: కరెంటు, నీళ్లతోనే 10 ఏండ్ల నుంచి రైతులు వ్యవసాయం చేస్తున్నరు. కాంగ్రెస్ అంటెనే కరెంటు ఉండదు. నీళ్ల కరువు. మళ్ల కాంగ్రెస్ వస్తే కరెంటు కోసం సబ్‌స్టేషన్ల ముట్టడి, రోడ్లపైన ధర్నాలు చేసుడే ఉంటది. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే వ్యవసాయం పడావుపడుతుంది. వాళ్లు తలో మాట మాట్లాడుతున్నరు. మూడు గంటల కరెంటు రైతులకు మస్తంటున్నరు. ఒక్క బుగ్గ ఉంటే బిల్లు కరెంటు బిల్లు మాఫీ అంటుండ్రు. 10 హెచ్‌పీ మోటార్లు పెట్టాలంటుండ్రు. వ్యవసాయం గురించి తెలిసినోడి మాటలు అట్లుండవు. వాళ్లకు ఓటేస్తె రైతులు ఆగమవుడే. ఇప్పుడు ఒక్క ముఖాన కరెంటు వస్తుంది. రాత్రిపూట బావుల కాడికి పోవుడు తప్పింది. డిమ్ము కరెంటు బాధలు పోయాయి. 24 గంటల కరెంటు తేజ్‌గ ఉంటుంది. దీంతో పంటల సాగుకు మాకు బాధలు తప్పినయ్. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఏటా రెండు పంటలు పండుతున్నయి. రైతుబంధులో ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏటా రెండు సార్లు వస్తున్నయి. పంటల పెట్టుబడికి ఇబ్బంది తప్పింది. ఒకప్పుడు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చెటోళ్లం. ఇప్పుడు ప్రభుత్వమే సాయం చేస్తున్నది. ఉచిత కరెంట్‌తో రైతులు బాగుపడుతున్నరు. కాంగ్రెస్‌ను నమ్మి మళ్ల బొందల పడొద్దు

వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోదు

నాగిడి నర్సిరెడ్డి, రైతు, లింగాలఘనపురం

లింగాలఘనపురం, నవంబర్ 24 :వ్యవసాయానికి 3 గంటల కరెంట్‌తో మూడు మళ్లు కూడా పారవు. నేను 25 ఏండ్ల నుంచి ఎవుసం చేస్తున్న.. పదేళ్ల క్రితం కరెంట్ ఎప్పుడు వస్తదో. ఎప్పుడు పోతదో తెల్వక పోయేది.. లో వోల్టేజీతో వ్యవసాయ బోరుబావి, బావి విద్యుత్ మోటరు కాలిపోయేవి. ట్రాన్స్‌ఫార్మర్ కాలితే ఎన్నో కష్టాలు పడ్డాం. ఒక్కొక్క సారి పంటలు ఎండిపోయేవి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ ఉచితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుండ్రు. చెరువుల్లోకి నీళ్లు రావడంతో ఏటా ఎకరం వరి సాగును పెంచుకుంటున్నం. ఇప్పుడు ఆరెకరాల వరిని పండిస్తున్నా.. మూడు గంటల కరెంట్‌తో మొదటి మూడు మళ్లుకూడా సాగు కావు. ఎన్నికలు రావడంతో మాయమాటలు చెబుతున్న కాంగ్రెస్‌ను నమ్మొద్దు. లేకుంటే మళ్లీ అరిగోస పడాల్సిందే.

ధరణి తీసేస్తే రైతులకు ఇబ్బందే..



రఘునాథపల్లి, నవంబర్ 24 : కాంగ్రెస్సోళ్లు ధరణి పోర్టల్ తీసేస్త మంటున్నరు. తప్పిదారి వాళ్లు వస్తే మళ్లీ పాత కథే అయితది. ఆఫీసుల చుట్టూ తిరుగుడు తప్పదు. ఇప్పుడు ధరణితోనే భూముల పత్రాలు భద్రంగా ఉంటయ్. రైతులకు రైతుబంధు పైసలు పడతాన్నయ్. అదేకాకుండా రైతు చనిపోతే రూ.5 లక్షలతో అదుకునే రైతుబీమా సౌకర్యం ఉన్నది. ఇది కుటుంబానికి ఎంతో భరోసాగా ఉంటది. ధరణి పోతే ఇవన్ని ఎట్లా వస్తయ్.. కౌలుదారు, అనుభవదారు కాలం మళ్లీ పెడితే ఇప్పుడు పెరిగిన రేట్లు మారుతయ్. అదే ధరణి ఉంటే ఒక్కటే డిజిటల్ పట్టా పాస్ బుక్కు ఒకే రేటుకు అమ్ముకునేట్లుగా రైతుకు సమన్యాయం జరిగేలా ఉంటది. కాలం పేరుతో విభజిస్తే కాస్తులో ఉన్న రైతులపై పట్టాదారుల పెత్తనం మళ్లీ మొదలవుతుంది. పట్టా దారుగా రైతులు మార్చుకునేందుకు మళ్లీ ఆఫీసులు చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలి. పైరవీలకు పైసలియ్యాలె. మళ్లీ ఎనుకటి లెక్క గోస పడాలె. అందుకే ధరణి, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే రైతులకు భరోసా ఉంటది. అందుకే మా ఊరి వ్యవసాయ దారులంతా సీఎం కేసీఆర్ సార్ తీసుకొచ్చిన ధరణి బాగుందని అంటున్నరు. ఈ ఎన్నికల్లో మేమంతా కారు గుర్తుకే ఓటేస్తం. మళ్లీ బీఆర్ఎస్ సర్కారు వస్తది.

–రేసు కుమార్, రైతు, మాధారం

పైరవీకారుల పెత్తనాన్ని రైతులు భరించరు..

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 24 : ధరణి రాక ముందు తహసీల్దార్ కార్యాలయాలు పైరవీకారులతో జాతరలెక్క కనిపించేవి. భూమిని నమ్ముకుని పొద్దంతా పొలంలో ఉండే రైతులకు బయటి ప్రపంచంతో సంబంధం ఉండేది కాదు. దీంతో మాకు అధికారులతో పరిచయాలు ఉండేవి కావు. వీఆర్వోలు లంచాలు తీసుకుని రాత్రికి రాత్రే మా భూములను ఇంకొకరి పేరుపై మార్చినప్పుడు పైరవీకారులతో నెలల తరబడి తహసీల్దార్ చుట్టూ తిరిగేటోళ్లం. కానీ తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ రైతుల బాధలను అర్థం చేసుకుని వీఆర్వోలతో ఇబ్బందులు లేకుండా ధరణి తీసుకొచ్చిండ్రు. దీంతో భూములు కొనేవారు, అమ్మేవారు స్లాట్ బుక్ చేసుకుని ప్రశాంతంగా రిజిస్ట్రేషన్ చేయిం చుకుంటున్నరు. ఇప్పుడు తహసీల్దార్ కార్యాల యాలు ప్రశాంతంగా కనిపిస్తున్నయ్. గతంలలో కంటే భూములు రిజిస్ట్రేషన్లు పెరుగుతన్నయి. ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి భూములు భద్రంగా రికార్డుల్లో ఉన్నయి. ఇలాంటి స్థితిలో కాంగ్రెస్ నాయకులు ధరణి పోర్టల్ తీసేయాలని మాట్లాడుతున్నరు. వారి ఆలోచన సరికాదు. కాంగ్రెస్ వస్తే మళ్లీ దళారుల దందా మొదలైతది. ఒకరి భూములు మరొకరి పేరున రాస్తే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మా భూములు మాకే ఉన్నాయా? లేదా? అనే టెన్షన్ ఉంటుంది. రైతుబంధు సాయంతోపాటు ఉచిత విద్యుత్ ఇచ్చి సాగునీటి సమస్యను తీర్చిన గులాబీ పార్టీకే ఈ ఎన్నికల్లో రైతులు ఓటేస్తరు. మళ్లీ బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వస్తుంది.

–గుర్రం రాజు, రైతు, శివుడిపల్లి

హస్తం పార్టీని నమ్మితే రైతులకు కాళ రాత్రులే..

రఘునాథపల్లి, నవంబర్ 24: రైతులకు మూడు గంటలే కరెంట్ సరిపోతుందన్న కాంగ్రెస్సోళ్లకు ఓటేస్తే రైతులకు కాలరాత్రులే. వారికి ఓటేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయ్. చీకట్లో నిద్రహారాలు మాని వ్యవసాయ బావుల వద్ద పడిగాపులు పడాల్సి వస్తది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతుల జీవితాల్లో ఇప్పుడిప్పుడే వెలుగులు కన్పిస్తున్నయ్. కాంగ్రెస్‌ను నమ్మితే రైతులకు మళ్లీ చీమ్మ చీకట్లే.. మూడు గంటల కరెంట్‌తో కనీసం 20 గుంటల భూమి కూడా తడవదు. కాంగ్రెస్ హయాం లో కరెంట్ కోతలతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డరు. మళ్లీ ఆ పాత రోజులు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతరు. రైతులకు మంచి రోజులు ఉండాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలె.

–శేరి గాలిరెడ్డి, రైతు, కన్నాయపల్లి

మళ్లీ పాత రోజులు రావొద్దన్నదే మా అభిప్రాయం..

వేలేరు, నవంబర్ 24: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి వాళ్లకు ఓట్లస్తే మళ్లీ పాత రోజులొస్తయి. అలాంటి పరిస్థితి రావొద్దన్నదే మా అభిప్రాయం. మూడు గంటల కరెంట్ సరిపోక గతంలో రాత్రిళ్లు బావుల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి. కాంగ్రెస్ వల్ల చీకట్లో నిద్రహారాలు మాని కరెంట్ కోసం వేచి చూసే పరిస్థితి ఏర్పడతది. పదేళ్ల క్రితం ఆ పార్టీ ప్రభుత్వంలో రైతులు రాత్రిపూట బావుల కాడికి పోయి ప్రమాదాల భారిన పడిన సందర్భాలు ఎన్నో ఉన్నయ్. చీకట్లో బావుల వద్దకు వెళ్తే ఏం జరుగుతుందో తెలియదు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులు ఇప్పుడిప్పుడే మంచిగా ఉంటున్నరు. రాత్రిపూట కరెంట్ కోసం బావుల కాడికి భయంతో పోయో బాధలు తప్పినయ్. మళ్లీ రాత్రి పూట కరెంట్ కోసం జాగారం చేసే రోజులు మాకొద్దు. 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వానికే మా మద్దతు.

– కౌశి పురుషోత్తం, వేలేరు గ్రామం